


ధ్వజస్తంభ పూజ (ఇన్‌సెట్‌లో) ఉత్సవాల ప్రారంభోత్సవ సందర్భంగా పూజలు

మహాభారత ఉత్సవాలకు
శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

వెదురుకుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పంచాయతీ మొరవ గ్రామంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల వారి దేవస్థానం మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది.ఆలయంలోని ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో పాటు ధ్వజస్తంభానికి పూజలు చేశారు. ధ్వజస్తంభ పూజతో మహాభారత ఉత్సవాలు మొదలయ్యాయి.కొండకిందపల్లెకు చెందిన మిట్టపల్లి మోహన్‌రెడ్డి, చిలకమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.ఈ నెల 27వ తేది రాత్రి అగ్నిగుండ ప్రవేశంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల రోజుల్లో రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు తిరుపతికి చెందిన భాగవతారిణి మధులతచే హరికథా కాలక్షేపం జరుగుతుంది. రాత్రుల్లో వేంకటేశ్వర నాట్యకళామండలి ద్వారా నాటక ప్రదర్శనలుంటాయి. ఉత్సవాల సందర్భంగా రోజూ మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో ఆలయం వద్ద అన్నప్రసాద పంపిణీ ఉంటుంది.




ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతం - స్వర్ణ రథంపై వినాయకుడి విహారం

స్వర్ణ రథంపై వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో బుధవారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం ప్రధాన ఆలయంలో మూల విరాట్‌కు వైభవంగా అభిషేకం నిర్వహించి స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ప్రధాన ఆలయం నుంచి ఆలయ అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో ఆస్థాన మండపంలోని వేదికపైన కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం రెండు దఫాలుగా నిర్వహించారు. ఈ వ్రతంలో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. అనంతరం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరుకేనా పనులు, నిధులు!

గత ఐదేళ్ళ కాలంలో చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గానికే అధిక నిధుల కేటాయింపులు, అధిక పనులు మంజూరు చేయడం ఏమిటి?ఇంత అడ్డగోలు కేటాయింపులు రాష్ట్రంలో మరెక్కడా జరగలేదు.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అప్పట్లో మంత్రి హోదాను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగం చేశారు. దీంతో మిగిలిన ఆరు నియోజకవర్గాల అభివృద్ధి కుంటుపడినట్లే కదా? ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలి.

- అసెంబ్లీ పద్దుల కమిటీ సభ్యుల్లో ఓ వర్గం ఆరోపణ



అసెంబ్లీ పద్దుల కమిటీ సమీక్షా సమావేశం

- మిగిలిన నియోజకవర్గాల మాటేంటి?
- అసెంబ్లీ పద్దుల కమిటీ సభ్యుల్లో ఓ వర్గం ధ్వజం
- అలాగైతే 2014 నుంచి జరిగిన పనులను పరిశీలిద్దామంటూ మరో వర్గం అసహనం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో బుధవారం అసెంబ్లీ పద్దుల కమిటీ తొలి సమీక్షా సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ జోగేశ్వర రావు అధ్యక్షతన సమావేశం జరగ్గా, కలెక్టర్ సుమిత్‌కుమార్ తొలుత సభ్యులకు స్వాగతం పలికారు. డీఆర్వో మోహన్‌కుమార్ శాఖలవారీ సమీక్షా వివరాలను సభకు తెలియజేశారు. మొత్తం 11 శాఖల వారీగా బడ్జెట్, నాన్ బడ్జెట్ ద్వారా నిధుల కేటాయింపులు, వ్యయం, మిగులు, అందుకు గల కారణాలు మార్చి నెలాంతంలో మురిగిపోయిన నిధుల గూర్చి కమిటీ సభ్యులు ఆరాతీశారు.పంచాయతీరాజ్‌శాఖపై సమీక్ష జరుగుతుండగా ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి పనులగూర్చి వివరించారు. సభ్యురాలు భూమా అఖిలప్రియ మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ హయాంలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి వివిధ పథకాల ద్వారా పుంగనూరు నియోజకవర్గానికి రూ.310 కోట్ల విలువ గల పనులు మంజూరు చేశారు? మిగతా నియోజకవర్గాలకు ఎన్ని పనులు మంజూరు చేశారు? ఎన్ని పూర్తయ్యాయి?కేటాయించిన నిధులెన్ని? తదితర వివరాలను నివేదిక రూపంలో సభ్యులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రగతిని ఎస్ఈ విజయ్‌కుమార్ వివరిస్తూ జలజీవన్ మిషన్ ద్వారా పుంగనూరు నియోజకవర్గానికి రూ.40 కోట్లతో చేపట్టిన 1164 పనుల్లో 613 పనులు పూర్తయ్యాయన్నారు. దాంతో మరో సభ్యుడు పార్థసారథి పుంగనూరు నియోజకవర్గానికి పెద్దఎత్తున పనులు కేటాయింపు, నిధుల విడుదలతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికార దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోందన్నారు.దీన్ని దాచిపెట్టాల్సిన అవసరం లేదని, తప్పులు గుర్తించేందుకే కమిటీ సభ్యులు చిత్తూరుకు వచ్చారన్నారు. మిగిలిన నియోజకవర్గాలకు కాదని ఒక్క పుంగనూరుకే అధిక పనులు మంజూరుచేయడమేమిటని ప్రశ్నించారు.దాంతో కమిటీ సభ్యులైన వరుదు కళ్యాణి,వరాహ వెంకట సూర్యనారాయణరాజు అడ్డుతగులుతూ 2019 నుంచి జరిగిన పనుల ప్రగతి సమీక్షించేందుకు ముందు 2014నుంచి జరిగిన ప్రగతిని చూద్దామా అని ప్రశ్నించారు. రాజకీయాలపరంగా కాకుండా నిష్పక్షపాతంగా మాజీమంత్రి పెద్దిరెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వ్యక్తిగతంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఎక్కువ నిధులు తెప్పించారన్నారు. ఇందులో తప్పేముందన్నారు. శాసనసభ్యులు తమ నియోజకవర్గ అభివృద్ధికోసం ప్రభుత్వంతో పోరాడడం నిజమేకదా అన్నారు.అన్నిట్లో రాజకీయం చేస్తూ గతాన్ని తవ్వవద్దన్నారు.దీంతో సమావేశం పక్కదారి పడుతున్నట్లు గుర్తించిన కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు సభ్యులకు సర్దిచెబుతూ చిత్తూరులో ఇది తమ తొలి సమావేశమని, లోటుపాట్లు ఉంటే చర్చించుకుని, వాటిని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్ళాల్సి ఉందన్నారు. టీడీపీ, వైసీపీ అంటూ రాజకీయాలు చేస్తే అధికారుల ఎదుట నవ్వులపాలౌతామన్నారు. పరస్పర ఆరోపణలు చేస్తూవుంటే అధికారులు లోలోపల సంతోషిస్తూ సభ్యులడిగే ప్రశ్నలకు ఇక జవాబు చెప్పాల్సిన అవసరం లేదని చులకనగా చూసే అవకాశం ఉందని సర్దిచెప్పారు.కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, పాశిం సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావుతో పాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిటీ డిప్యూటీ సెక్రటరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లు లాభాలు చూపించే మాయ యాప్‌లని, వాటి వలలో పడి జీవితాలు, కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ మణికంఠ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోజు రోజుకూ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న క్రమంలో అభివృద్ధితో పాటు మోసపూరిత చర్యలకు దారితీసే మార్గాలు విస్తృతమవుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో క్రికెట్ క్రీడలు, లాటరీలు, కార్డుగేమ్స్ పేరుతో నడుస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కోట్లాది రూపాయల అక్రమ మార్గాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయని చెప్పారు. యువత వాటికి దూరంగా ఉండటానికి కొన్ని సూచనలు చేశారు. ● సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే బెట్టింగ్ లింకులపై అప్రమత్తంగా ఉండాలి. ● ఎవరైనా బెట్టింగ్ చేయమంటూ డబ్బులు అడిగితే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదా డయల్ 112కు లేదా చిత్తూరు పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005కు సమాచారం ఇవ్వాలి. ● సైబర్ నేరాలపై 1930ని ఉపయోగించుకోవాలి. ● ఈ యాప్‌లపై యువత, విద్యార్థులు మానసికంగా బలహీనపడే అవకాశమున్నందున తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

నలుగురు క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు నిర్వాహకులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి నగదు, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు... ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో బుధవారం సంతపేట ప్రాంతంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దాంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సంతపేట దొంగలబావి వీధికి చెందిన రాజా(26), ఓబనపల్లెకాలనీకి చెందిన దస్తగిరి(33), సర్ఫుద్దీన్(27), ముని(26)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.48వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు జడ్జిల బదిలీ

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు.చిత్తూరులో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఎస్పీడీ వెన్నెల గుంటూరు జిల్లా రేపల్లె అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. పీలేరులో సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న కె.రవి చిత్తూరుకు రానున్నారు. మదనపల్లెలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జిగా ఉన్న వెంకటేశ్వర్లు నాయక్ అనంతపురం జిల్లా హిందూపురానికి బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా గన్నవరం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగాఉన్న కె.జయలక్ష్మి ఆయన స్థానంలోకి రానున్నారు.

రేషన్ పంపిణీ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్,ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా ఎండీయూ వాహనాల ద్వారా ఈనెల ఒకటో తేదీ నుంచి తెల్లకార్డుదారులకు చేపట్టిన రేషన్ సరుకుల పంపిణీ గడువు గురువారంతో ముగియనుంది. కార్డుదారుల వినతిమేరకు గడువును ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు డీఎస్వో శంకరన్ విలేఖరులకు తెలిపారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




భాస్కర నాయుడు -శ్రీనివాసులు నాయుడు

ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో రెండు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది.సోమల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కె.శ్రీనివాసులు నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కె.భాస్కర నాయుడు నియమితులయ్యారు.తిరుపతి జిల్లాలో పాకాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కె.సుధాకరయ్య,చంద్రగిరి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్.గౌస్ బాషా నియమితులయ్యారు.

విద్యాశాఖలో ఇక ఒక్క యాపే..!

● ఆర్జేడీ శామ్యూల్



ఆర్జేడీకి సీనియారిటీ జాబితా సమస్యలు వివరిస్తున్న ఎస్టీయూ నేతలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇక నుంచి ఒక్క యాప్‌లోనే మొత్తం సమాచారం పొందుపర్చే వీలుందని ఆర్జేడీ శామ్యూల్ తెలిపారు. తుది దశకు చేరిన టీచర్ల సీనియారిటీ జాబితా పరిశీలనకు బుధవారం చిత్తూరుకు వచ్చిన ఆయన డీఈవో ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. విద్యాశాఖలో ఇప్పటి వరకు ఉన్న వివిధ యాప్‌ల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా లెర్నింగ్ ఎక్సలెన్సీ ఇన్ ఆంధ్రప్రదేశ్ (ఎల్ఈఏపీ-లీప్) యాప్‌ను బుధవారం నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. జిల్లావ్యాప్తంగా కేవలం 8 మంది ఉపాధ్యాయులు మినహా 8416 మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాక్టివేట్ అయ్యారని వివరించారు. ఉపాధ్యాయుల హాజరు, సెలవులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు, విద్యార్థుల మార్కుల నమోదు, పాఠశాల అభివృద్ధి తదితర 36 అంశాలను ఈ ఒక్క యాప్‌లోనే నమోదు చేసే సౌలభ్యం ఉందన్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టిన సీనియారిటీ జాబితా తుదిదశకు చేరిందని, చివరిగా ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ వరకు సంబంధించి 30, ఎస్ఏ నుంచి హెచ్ఎంల వరకు సంబంధించి 38 మొత్తంగా 68అభ్యంతరాలు వచ్చాయని, వీటిని రాత్రికి పూర్తి చేస్తామని వివరించారు. రోస్టర్ పాయింట్లపై ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కాగా ఈనెల 21 నుంచి 24 వరకు విద్యార్థుల ఉత్తీర్ణత, ఉన్నత తరగతులకు వెళ్లే విధానం పూర్తి చేయాలని హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అంగన్‌వాడీ నుంచి ఒకటవ తరగతికి, ఒకటి నుంచి తొమ్మిది తరగతులకు విద్యార్థులను ప్రమోట్ చేయాల్సి ఉందన్నారు.డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాలో అసంబద్ధతలు నివారించాలి

టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో పొరబాట్లు సరిదిద్దడంతో పాటు ఇబ్బందులను నివారించాలని, అర్హులైన వారికి అన్యాయం జరక్కుండా టీచర్ల సీనియారిటీ జాబితా రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాలు బుధవారం ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి విజ్ఞప్తి చేశాయి. హైస్కూల్ ప్లస్‌లలో పదవీ విరమణ, ప్రమోషన్ల కారణంగా డెప్లీయిడ్ పీజీటీ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్, ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు, యూటీఎఫ్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం రెడ్డెమ్మ నవలల పోటీలకు
రచనల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కుప్పం రెడ్డెమ్మ 2024వ సంవత్సర జాతీయ స్థాయి నవలల పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షురాలు రోజా ప్రియ, సంయుక్త కార్యదర్శి నిరంజన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.అభ్యుదయ తెలుగు రచయితలు రచించిన నవలలు, వివిధ పత్రికా, మీడియా మాధ్యమాలలో ప్రచురితమై పాఠకుల ప్రశంసలు పొందిన రచనలు పోటీలకు అర్హత పొందుతాయని తెలిపారు.తమ రచనలను మూడు కాపీల చొప్పున వచ్చే నెల 5వ తేది లోపు డాక్టర్ కె. రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, 17-434 సుందరయ్యవీధి, చిత్తూరు -517002 చిరునామాకు రచయితలు పంపాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన నవలా రచయితలకు రూ.10000 చొప్పున నగదు బహుమతి అందజేసి జూన్ 12న చిత్తూరులో నిర్వహించే కుప్పం రెడ్డెమ్మ పురస్కార మహోత్సవంలో ఘనంగా సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

‘కొండ’పైకి డ్రోన్ ఎలా తీసుకెళ్లారు?

● అలిపిరి టోల్‌గేట్‌లో ఎస్పీ తనిఖీలు



టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో డ్రోన్ కలకలం నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో (ఎఫ్ఏసీ) హోదాలో బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు అలిపిరి టోల్‌గేట్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 'ఇటీవల తిరుమలకు డ్రోన్ ఎలా తీసుకెళ్లగలిగారు? తనిఖీలు ఎందుకు చేయలేదు? టోల్‌గేట్ వద్ద సిబ్బంది ఎందుకంత నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. టోల్‌గేట్ నుంచి తిరుమలకు ఏవైనా నిషేధిత వస్తువులు వెళ్లినట్లు తెలిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు, లగేజీలు ఎలా తనిఖీచేస్తున్నారు. లగేజీ స్కాన్ చేయడానికి ఎంత సమయం పడుతుందనేది పరిశీలించారు. ప్రతి ఇమేజ్‌ను క్షుణంగా పరిశీలించాలని టోల్‌గేట్ స్కానర్ మానిటర్ వద్ద సిబ్బందిని ఆదేశించారు. అనుమానమున్న వస్తువులను ఫిజికల్‌గా తనిఖీ చేయాలన్నారు.

యూఎస్‌లో స్టేట్ మంత్రిగా చంద్రగిరివాసి



బద్రి లంకెళ్ళ

చంద్రగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి చెందిన బద్రి లంకెళ్ళ ఇటీవల అమెరికాలోని విస్కాన్‌సిన్ స్టేట్‌లోని మాడిసన్ డిస్ట్రిక్ట్-7లో ఆల్డర్ పర్సన్‌గా 53.8 శాతం ఓట్లతో ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన ఆ స్టేట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకురాలు లంకెళ్ళ లలిత, శ్రీరాముల కుమారుడు బద్రి విస్కాన్‌సింగ్ స్టేట్‌లోని మాడిసన్ డిస్ట్రిక్-7లో సుమారు పాతికేళ్లుగా ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన ఆల్డర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. తాజాగా నాలుగు శాఖలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై చంద్రగిరిలో పలువురు సన్నిహితులు బద్రిని ఫోన్లో అభినందించారు.



నాడు — పానాటూరు వద్ద



నేడు



నాడు



నేడు — ఎంసీఆర్ క్రాస్ వద్ద

వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు పాడై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వాటిని బాగుచేయాలని పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడునెలలకే ఎమ్మెల్యే జగన్మోహన్ కలెక్టర్ దృష్టికి రోడ్డు పరిస్థితిని తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో గుడిపాల మండలంలోని ఎంసీఆర్ క్రాస్ నుంచి తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన గొల్లమడుగు వరకు పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఎంసీఆర్ క్రాస్ వద్ద సీసీ రోడ్డు, పానాటూరు వద్ద సిమెంటు రోడ్డు పనులు పూర్తిచేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. -గుడిపాల, ఆంధ్రజ్యోతి

పురమిత్ర యాప్‌తో 150 రకాల సేవలు

పలమనేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని పలమనేరు కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పురమిత్ర యాప్‌తో పట్టణ ప్రజలు ఇంట్లోనే కూర్చొని సేవలను పొందే వీలుందన్నారు. కృత్రిమ మేధ సహాయంతో రూపొందించిన ఈ యాప్ ద్వారా 150 రకాల సేవలు పొందవచ్చన్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిదీపాలు వంటి ఏ సమస్య అయినా సరే యాప్ ద్వారా తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లొచ్చని తెలిపారు. పురపాలిక, రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్, అకౌంట్స్, పరిపాలనా విభాగం, జనన మరణ, వివాహ ధ్రువపత్రాలు, పన్ను చెల్లింపులు, నీటి పన్ను, రెన్యూవల్స్ ఇందులో పొందవచ్చన్నారు. సమస్య సంబంధిత విభాగాధికారికి చేరుతుందన్నారు. 15 నుంచి 30 రోజుల గడువులోపు సమస్యలను పరిష్కరిస్తారని వివరించారు. ఈ యాప్ గూగుల్‌ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. విస్తృత శ్రేణి ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ప్రజలు తమ మొబైళ్లలో 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి ప్రతి ఇంటి వద్ద మనమిత్ర పేరుతో ఇంటింటికీ అవగాహన ప్రచారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వివరాలకు దగ్గరలోని సచివాలయ సిబ్బందితో సంప్రదించి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని సేవలను పొందాలన్నారు. బస్సు టిక్కెట్, టీటీడీ, ఇతర ప్రధాన ఆలయాల సేవలను యాప్ నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు.

యాస్మిన్ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన యువతి యాస్మిన్ మరణానికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం,ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్పీ మణికంఠను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. అంతకుముందు మానవ హక్కుల వేదిక నేతలు, డీవీఎంసీ సభ్యులు, సీపీఎం నేతలతో కూడిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులందరూ యాస్మిన్ భర్త సాయితేజ ఇంటికెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కెళ్లి యాస్మిన్ మృతికిగల కారణాలు, కేసు నమోదు, దర్యాప్తు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో యాస్మిన్ తల్లిదండ్రులు కన్న బిడ్డనే చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.యాస్మిన్ మరణించి నాలుగు రోజులవుతున్నా ఇంత వరకు పోలీసులు నిందితులను పట్టుకోలేదన్నారు.మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ మదనశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రోహిత్, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రులకు నిధులు పెంచాలి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిధుల కేటాయింపులు మరింత పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. బుధవారం శాసనసభ అంచనాల కమిటీ సమావేశం చిత్తూరు జడ్పీ మీటింగ్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోక్సో కేసులకు సంబంధించి బాధితులకు పరిహారం నిబంధనల మేరకు అందిస్తున్నామన్నారు. కానీ బాధితులు ఎక్కువ మొత్తం కావాలని కోరుతున్నారని చెప్పారు. దీంతోపాటు మిషన్ వాత్సల్య కింద అందిస్తున్న నగదు మొత్తాన్ని పెంచాలని కోరారు.కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు మాట్లాడుతూ అంచనాల కమిటీ సమీక్షకు శాఖలవారీగా నివేదించే నివేదికలను ఇకముందు సమగ్ర సమాచారంతో అందించాలని ఆదేశించారు. సభ్యుడు వెంకటరాజు మాట్లాడుతూ గతంలో మంజూరు చేసిన పనులు ఇంకా అసంపూర్తిగా ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భూమా అఖిలప్రియ మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరారు. అధికారులు వారి శాఖల గణాంక వివరాలు కాకుండా పథకాల వారీగా మంజూరైన నిధులు, వ్యయ వివరాలను అందించాలన్నారు. పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వశాఖల ద్వారా అమలయ్యే పథకాల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయింపుల వివరాలను అందించాలని కోరారు. వ్యవసాయరంగానికి సంబంధించి 2019-20 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం కేటాయించిన నిధులు, వాటి వినియోగం వివరాలను అందించాలని నిమ్మక జయక్రిష్ణ కోరగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు మందుతో పాటు కుక్కకాటుకు కూడా మందులను అందుబాటులో ఉంచాలని వరాహ వెంకట సూర్యనారాయణ రాజు కోరారు. పోక్సో కేసుల్లోని బాధితులకు వారి పిల్లల సంరక్షణ అంశాలపై ఐసీడీఎస్ అధికారుల నుంచి వరుదు కళ్యాణి వివరణ కోరారు. పలు శాఖల అధికారులు మాట్లాడుతూ మురిగిపోయిన నిధుల గూర్చి ప్రస్తావించారు. సమావేశంలో జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ, వ్యవసాయం, హార్టికల్చర్, విద్య, వైద్య, డీసీహెచ్‌ఎస్, ఐసీడీఎస్ శాఖలకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా మూడు గంటలపాటు సమీక్షించారు.కాగా అంతకుముందు చిత్తూరుకు చేరుకున్న అసెంబ్లీ పద్దుల కమిటీ బృందానికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కమిటీ బృంద సభ్యులు ఎమ్మెల్యే జగన్మోహన్ నివాసానికి వెళ్లారు.

ప్రచండ భానుడి భగభగలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎండలు భగభగమంటున్నాయి.బుధవారం మండలాల వారీగా ఉష్ణోగ్రతల వివరాలివీ...నగరిలో 38.4, తవణంపల్లెలో 37.7,చిత్తూరు ,గుడిపాల మండలాల్లో 37.5, సోమలలో 36.5,ఎస్‌ఆర్‌పురంలో 36.4,యాదమరిలో 35.9 ,జీడీ నెల్లూరులో 35.8, గంగవరం,వెదురుకుప్పం,పెద్దపంజాణి ,పూతలపట్టు, పులిచెర్ల మండలాల్లో 35.5,సదుంలో 35.3, చౌడేపల్లె, శాంతిపురం,కార్వేటినగరం,గుడుపల్లె,నింద్ర,ఐరాల,పెనుమూరు,విజయపురం,పాలసముద్రం మండలాల్లో 35.2, బంగారుపాళ్యంలో 34.6, రొంపిచెర్లలో 34,వి.కోటలో 33.9, పలమనేరులో 33.5,పుంగనూరులో 33,కుప్పంలో 32.7, బైరెడ్డిపల్లెలో 32.4 , రామకుప్పంలో 32.2. డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కామేశ్వరస్వామి ఆలయంలో నేటినుంచి కుంభాభిషేక ఉత్సవాలు



ఇష్టకామేశ్వరస్వామి ఆలయం

విజయపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలం పన్నూరులో గురువారం నుంచి ఆనందవల్లీ దేవీ సమేత ఇష్టకామేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ అష్టబంధన మహా కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఇష్టకామేశ్వర స్వామి ఆలయాన్ని కులోత్తుంగ చోళ రాజులు నిర్మించగా, కాలక్రమేణా శిథిలావస్థకు గురికావడంతో 150 సంవత్సరాల క్రితం క్షూరికాపురానికి చెందిన దొమ్మరాజు నాగరాజు గ్రామపెద్దల సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయించారు. నిత్య పూజలు చేయడానికి సర్వేశ్వర గురుక్కల్‌ను అర్చకుడిగా నియమించారు. అప్పటి నుంచి దొమ్మరాజు నాగరాజు వారసులు పుల్లమరాజు, గోపాల్‌రాజు, విష్ణువర్ధనరాజు ఆలయ ధర్మకర్తలుగా వ్యవహరించారు. ప్రస్తుతం మదన గోపాలరాజు ధర్మకర్తగా ఉంటున్నారు. 1999, 2025లో విష్ణువర్ధన రాజు, మదనగోపాల్‌రాజు జీర్ణోద్ధరణ అష్టబంధన కార్యక్రమం నిర్వహించారు.ఈ ఆలయ ప్రాంగణలో వినాయకస్వామి, నాగదేవత, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, దుర్గాదేవి, చండికేశ్వర స్వామి, కాలభైరవస్వామి, సూర్యనారాయణస్వామి, వీరభద్రస్వామి ఆలయాలున్నాయి. స్వామి వారి గర్భగుడి కోష్టలముల్లో విఘ్నేశ్వర స్వామి, మేధాదక్షిణామూర్తి, ప్రసన్నవెంకటేశ్వరస్వామి, బ్రహ్మ, దుర్గాదేవీ తదితర మూర్తులను ప్రతిష్ఠించారు.

నిత్య పూజలు

ఈ ఆలయంలో మహాశివరాత్రి లింగోద్భవ అభిషేకం, దేవీ నవరాత్రుల అభిషేకం, ఉత్సవాలు, ఆరుద్ర నక్షత్ర అభిషేకం, గోపుర ద్వార దర్శనం, గ్రామోత్సవం, కార్తీక సోమవారాల్లో అభిషేకం, మాస శివ రాత్రి, కృష్ణపక్ష ప్రదోషపూజ, శనిత్రయోదశి అభిషేకం, పార్వేటి ఉత్సవాలు నిర్వహిస్తారు.

టీటీడీ స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలి



ఆనంద వల్లీ దేవీ సమేత ఇష్టకామేశ్వస్వామి ఆలయాన్ని టీటీడీ స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలి. కల్యాణ మండపాలు నిర్మించి పేద ప్రజలు శుభ కార్యాలు చేసుకునే విధంగా ప్రోత్సహించాలి. ఈ ఆలయానికి 7 కిలోమీటర్ల దూరంలో బుగ్గ దేవాలయం, నింద్రలో వెంకటేశ్వరస్వామి ఆలయం కూడా టీటీడీ అధీనంలో అభివృద్ధి చెందుతున్నాయి.

- మదనగోపాల్‌రాజు, ఆలయ ధర్మకర్త, క్షూరికాపురం

రాష్ట్రాల హక్కులను హరిస్తోన్న కేంద్రప్రభుత్వం

తమిళనాడు సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. బుధవారం చిత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ భావాలున్న వ్యక్తులను గవర్నర్లుగా నియమించి రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా వున్న హక్కులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తమిళనాడు అసెంబ్లీలో ఆమోదించబడిన అనేక బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ రవి తొక్కిపెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు.ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించడం గొప్ప పరిణామమన్నారు. ఈ విషయమై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసర ముందన్నారు.ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి అయ్యే ఖర్చుతో ప్రజలపై ఎలాంటి భారం పడదని ముఖ్యమంత్రి ప్రకటించారని, అయితే ఇందుకు చేసిన రూ.62 వేల కోట్ల అప్పులను ఎలా కడతారో ప్రజలకు చెప్పాలన్నారు.విజయవాడ, విశాఖపట్నం అభివృద్ధిపైనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలూ సమగ్రాభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.కడపలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మూతబడ్డ సహకార సంస్థలకు జీవం పోసే చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీలో కల్తీనెయ్యి, గోవుల మృతి వంటి అంశాలపై రాజకీయ పార్టీలు భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడుతుండడం చాలా బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నగర కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

దాణా కొనుగోళ్లలో భారీ అవినీతి

చనిపోయిన ఆవులు, దూడలు చెత్తకుప్పల్లోకి ● టీటీడీ ప్రతిష్ట దిగజారింది వైసీపీ పాలనలోనే:టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల ప్రతిష్ట దిగజారింది వైసీపీ పాలనలోనే అని, అప్పుడు జరిగినన్ని అనర్థాలు మరెప్పుడూ జరగలేదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు విమర్శించారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ టీటీడీ గోశాలలో చనిపోయిన ఆవులను, దూడలను ఎవరికీ కనిపించకుండా చెత్తకుప్పల్లో పడేసి గేటు దాటించిన వైసీపీ ప్రభుత్వ తాబేదారులు ఇప్పుడు నీతులు వల్లించడం అసహ్యంగా ఉందన్నారు. గోవులకు నాసిరకం, దాణా, మందులు కొనుగోలు చేసి, కమీషన్లతో జేబులు నింపుకోవడం ద్వారా మూగ జీవుల ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి కనీసం విరాళంగా వచ్చిన గోవుల రికార్డులు కూడా సరిగా నిర్వహించలేదని ఆరోపించారు.వైసీపీ హయాంలో టీటీడీలో దళారుల రాజ్యం నడిచిందని ఆరోపించారు.వైసీపీ పందికొక్కులు సేవా టికెట్లు, వసతి, ఎస్ఈడీ టికెట్లపై కూడా వ్యాపారం చేశారని దుయ్యబట్టారు. పవన్ కళ్యాణ్ సతీమణిపై అసత్య ప్రచారాలు చేస్తున్న వైసీపీ మూక, జగన్‌రెడ్డి ఒక్కసారైనా దైవ దర్శనానికి వచ్చినప్పుడు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చారా? అన్నది తెలుసుకోవాలన్నారు. శ్రీనివాస సేవా సమితి, సేవ్ ఫౌండేషన్‌కు సేంద్రియ పదార్థాలు సరఫరా చేసే వ్యక్తి ఆర్గానిక్ నెయ్యి ఇవ్వలేదని స్వయంగా చెప్పాడంటే గత ప్రభుత్వ పాలన ఎంత నీచానికి దిగజారిందో తెలుస్తుందన్నారు. కోట్ల రూపాయలు ఈ కుంభకోణంలో చేతులు మారాయని విమర్శించారు.గత ఏడాది ముఖ్యమంత్రిగా చంద్రబాబు పగ్గాలు చేపట్టిన తర్వాతే టీటీడీలో ప్రక్షాళన జరిగి ఆలయ నియమనిబంధనలకు అనుగుణంగా వ్యవహారాలు నడుస్తున్నాయన్నారు.టీడీపీ కుప్పం మున్సిపల్, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్, విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరదాగా కాసేపు...



పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ టీడీపీ నాయకులతో కలసి సరదాగా కాసేపు ఈత కొట్టారు. బుధవారం బంగారుపాళ్యం మండలంలో పర్యటించిన ఆయన మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండడంతో మొగిలిలోని కమలనాథరెడ్డికి చెందిన బావిలో ఈత కొట్టారు.మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ ,క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధరణీప్రసాద్ నాయుడు, పార్టీ ఉపాధ్యక్షులు లోకనాథనాయుడు, కమలనాథరెడ్డి, జనార్థన్ గౌడ్ ఆయనతో పాటు ఈతలో పాల్గొన్నారు.

- బంగారుపాళ్యం,ఆంధ్రజ్యోతి

కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను బుధవారం ఎస్పీ మణికంఠ సందర్శించారు. ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం సాంకేతిక పద్ధతులతో ప్రభుత్వం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నియంత్రణ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థలు, ఎమర్జెన్సీ మెకానిజం వంటి అంశాలను పరిశీలించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను సెంటర్ నెట్‌వర్క్‌లో లైవ్‌లో పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తియాప్ ఎలో అత్యవసర సమయాల్లో ఎస్‌వోఎస్ ద్వారా ఫిర్యాదులు అందిన కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. డయల్ 112 విభాగాన్ని పరిశీలించారు. ప్రజలకు అత్యవసరంగా పోలీసు, వైద్యం, అగ్నిమాపక సేవలను అందించే కీలకమైన నెంబరు అన్నారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది, డయల్ 112 సిబ్బంది, గస్తీ వాహన సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలోకమాండ్ కంట్రోల్ సెంటర్ ఎస్ఐ సహదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ద్రావిడ వర్సిటీకి ఐఎస్‌వో సర్వేలెన్స్ సర్టిఫికేషన్

గుడుపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఐఎస్‌వో సర్వేలెన్స్ సర్టిఫికేషన్ సాధించినట్లు పీఆర్‌వో డాక్టర్ గణేష్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవీక్యూఏ సర్టిఫికేషన్ సంస్థ కొన్ని రోజులపాటు ద్రావిడ విశ్వవిద్యాలయంలో సర్వేలెన్స్ ఆడిట్ చేసి అనంతరం ఐఎస్‌వో సర్వేలెన్స్ సర్టిఫికేషన్ బుధవారం విశ్వవిద్యాలయానికి మంజూరు చేసింది. దీంతో వర్సిటీ పరిపాలన భవనంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, ఆచార్య జయలలిత తదితరులు ఆనందం వ్యకం చేశారు.

మార్టిగేజ్ రద్దుకు లంచం అడుగుతున్నారు

● రైతు ఫిర్యాదుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

● 16 రోజులుగా తిప్పించుకుంటారా అంటూ ఆగ్రహం ● ఉన్నతాధికారులకు ఫిర్యాదు



తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'నా భూమి మార్టిగేజ్ రద్దుకు 16 రోజులుగా తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. అధికారులు లంచం కోసం వేధిస్తున్నారు' అంటూ ఓ రైతు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్, రెవెన్యూ మంత్రికి ఫోనుచేసి కోరారు. వివరాలిలా ఉన్నాయి. కేవీబీపురం మండలం గురుకుల కండ్రిగకు చెందిన విశ్రాంత వీఆర్వో, రైతు జనార్దన్‌రెడ్డి తన భూమిని మార్టిగేజ్ చేసి రుణం పొందాడు. ఇటీవల రుణం కట్టేసిన ఆయన మార్టిగేజ్ రద్దుకోసం ఒకటో తేది నుంచి తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తిరుగుతున్నారు. 4న మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసి వారం తర్వాత తీసుకున్నారు. మార్టిగేజ్ రద్దుకోసం రూ.1,500 చలానా, స్పెషల్ స్టాంపు తదితరాలు సిద్ధం చేసుకుని మంగళవారం వచ్చారు. బ్యాంకు అధికారులు రాలేదు. బుధవారం వచ్చిన జనార్దన్‌రెడ్డి.. లంచం కోసం మార్టిగేజ్ రద్దు ఆలస్యం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. పీఆర్ అతిథి గృహంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే.. వెంటనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. లంచం కోసం సిబ్బంది వేధిస్తున్నారని సబ్‌రిజిస్ట్రార్‌కు చెబితే దురుసుగా మాట్లాడారని, ఓ రైటర్ రూ.3,400 తీసుకున్నారంటూ ఎమ్మెల్యేకి రైతు చెప్పారు. చిన్నపాటి మార్టిగేజ్ రద్దుకు ఇన్ని రోజులు తిప్పించుకోవడం ఏంటని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక్కడ అవినీతికి పాల్పడుతున్నారంటూ 30మందికిపైగా తనకు ఫిర్యాదు చేశారన్నారు. అందుకనే తిరుపతిలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు తన సన్నిహితులు చెప్పారని ఆగ్రహించారు. ఎమ్మెల్యేకి వాటాలివ్వాలంటూ తన పేరు చెప్పి ఎలా వసూలు చేస్తారంటూ నిలదీశారు. అలాంటి ప్రచారం తానెప్పుడూ చేయలేదని సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ జవాబిచ్చారు. ఆ తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.

అందరు ఎమ్మెల్యేలూ ఇలా చేస్తే..

'తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై చాలా ఫిర్యాదులు వస్తుండటంతో అవినీతికి అంతం పలకాలని మెరుపువేగంతో స్పందించాను. దీనిపై చర్యలు తీసుకోవాలి. సీఎంచంద్రబాబు, యువనేత లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలందరూ ఇలా అవినీతి ఆరోపణలున్న కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు చేసి లంచాలను అరికట్టాలని కోరుతున్నా' అని సుధీర్‌రెడ్డి మీడియాతో అన్నారు. ఎమ్మెల్యే స్పందించిన తీరు సంతోషంగా ఉందని రైతు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఎందుకు జాప్యం జరిగిందనే దానిపై విచారిస్తున్నాం అని సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నాయకులు దృష్టి సారించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరుతున్నాయా.. లేదా అన్న విషయంపై నాయకులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా రేషన్ పంపిణీలో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తాగునీటి ఇబ్బందులు ఎక్కడైనా ఉంటే నాయకులు గుర్తించి వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కిషోర్‌గౌడ, రంగనాథ్, నాగరాజరెడ్డి, సోమశేఖర్‌గౌడు, ఆనంద్, కుట్టి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యంగౌడు, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో పాల ఉత్పత్తుల వాహనం



కుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తులను రవాణా చేస్తున్న ఓ లారీ బుధవారం కుప్పం బైపాస్ రోడ్డులో అగ్నిప్రమాదానికి గురైంది. తమిళనాడు రాష్ట్రం ఈ రోడ్ జిల్లా పెరున్దురై నుంచి కోల్‌కతాకు పాల ఉత్పత్తులను తీసుకెళ్తున్న వాహనంలో కుప్పం బైపాస్ రోడ్డు భారత్ పెట్రోలియం బంక్ సమీపంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఇంజిన్‌లో మొదలైన సమస్యతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కుప్పం అగ్నిమాపక అధికారి డి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కేవలం ఇంజిన్ మాత్రమే కాలిపోయింది. వెనుక ఉన్న బాడీ, అందులోని సుమారు రూ.కోటి విలువైన పాల ఉత్పత్తులు మాత్రం అగ్నిప్రమాదం నుంచి బయటపడ్డాయి. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

క్రమశిక్షణతో చదివితేనే విజయాలు


సరస్వతి పూజలో పాల్గొన్న ఎంఈవోలు

పలమనేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విజయాలు సాధించాలని పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం విద్యార్థులకు సూచించారు. బుధవారం పలమనేరు గుండుబావి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభను సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రమారాణి, లక్ష్మీనారాయణ, భాస్కర్, ఏకేఎస్ హరిబాబు, చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సప్తగిరి ప్రసాద్‌కు అమరనాథరెడ్డి పరామర్శ


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు సప్తగిరి ప్రసాద్‌ను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం పరామర్శించారు. సప్తగిరి ప్రసాద్ తల్లి చిట్టెమ్మ ఇటీవల మృతి చెందారు. తిరుపతిలోని సీపీఎస్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన చిట్టెమ్మ సంస్మరణ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి అమరనాథరెడ్డి హాజరయ్యారు. చిట్టెమ్మ చిత్రపటానికి అమరనాథరెడ్డి నివాళులు అర్పించారు. సప్తగిరి ప్రసాద్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ రాయలసీమ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


ఆర్డీవో కార్యాలయం ఎదుట వీఆర్‌ఏల నిరసన

పలమనేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వీఆర్‌ఏలు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలపై నిబంధనలకు విరుద్ధంగా మోపిన రాత్రి విధులు, ఇసుక, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వెంటనే నిలిపి వేయాలన్నారు. ఇంటర్ విద్యార్హతలు కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వోగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండు చేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సీపీఎం నాయకుడు ఓబుల్‌రాజు, వీఆర్‌ఏలు కలిసి సమస్యలను విన్నవించారు. నియోజకవర్గంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సమాజంలో గురువులకే అత్యున్నత గౌరవం


ఆంజనేయులును సన్మానిస్తున్న ఎంఈవోలు

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువులకే అత్యున్నత గౌరవముందని ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆంజనేయులు వచ్చేనెల 3వ తేదీన పదవీ విరమణ కానున్న నేపథ్యంలో బుధవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం శ్రీవాణి అధ్యక్షతన అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ 28 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలందించిన ఆంజనేయులు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఆంజనేయులు దంపతులను ఘనంగా సన్మానించారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పోతంశెట్టి రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే వర్గీకరణ చేయాలి


మాట్లాడుతున్న మాల జేఏసీ నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేయాల్సి ఉందని పుంగనూరు మాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ ప్రజా భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన తప్పుల తడకగా చేసి ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం దారుణమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని యువతను మోసం చేసిందని ఆరోపించారు. భూమి లేని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు శ్రీనివాసులు, మహానంది, జేవీ నాగరాజ, గణపతి, అంజి, బాలు, చంద్ర, నారాయణ, శ్రీనివాసులు, రామాంజులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల తనిఖీ

పెద్దపంజాణి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్రాయలపేట, గుట్టూరు, శివాడి గ్రామాలలో బుధవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఎంపీడీవో బాలాజీ తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం లోపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కారణంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మండలంలోని 25 పంచాయతీల్లో విడతల వారీగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతామని ఎంపీడీవో తెలిపారు. ఈవోపీఆర్డీ శారదాదేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల, పాళెం ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం అమలు, పిల్లల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి జానకీరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

● సోమల: గర్భిణులు వేసవిలో జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సీడీపీవో రాజేశ్వరి, సోమల వైద్యాధికారి డాక్టర్ జయసింహ తెలిపారు. బుధవారం పొదలకుంటపల్లె, ఆవులపల్లెల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ హరిత, సీహెచ్‌వో అమరనాథ్, ఆంజమ్మ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు


పొలం నుంచి మట్టిని సేకరిస్తున్న ఏవో ఫయాజ్ బాషా

కుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చని కుప్పం మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఆయన రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతను గురించి వివరిస్తున్నారు. నేలలోని ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. భూసార పరీక్షల కోసం రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 8331057784 ను సంప్రదించాలని కోరారు.

నేత్రపర్వంగా సప్త పుష్పపల్లకి సేవ


పల్లకిలో ఊరేగుతున్న దేవతామూర్తులు

రామకుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం సప్త పుష్పపల్లకి సేవ నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 10 గంటలకు సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకుడు, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, సీతా లక్ష్మణ, హనుమాన్ సమేత కోదండరామస్వామి, గంగమ్మ, పోతులరాజు, నల్లాపురెమ్మ ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు. తమిళనాడు, కర్ణాటక కళాకారులచే నృత్యవిన్యాసాలు ఆకట్టుకున్నాయి. పుష్పపల్లకి సేవకు వేలాదిగా ప్రజలు తరలి రావడంతో వీధులు కిటకిటలాడాయి.

కుప్పం విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహూకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

కుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచిన కుప్పం ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. అమరావతిలోని తన నివాసం వద్ద విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వారిని సన్మానించారు. కుప్పం వృత్తి విద్యా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వి.సుష్మిత 1000 మార్కులకుగాను 976 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు టాపర్‌గా నిలిచారు. అలాగే ఇదే కళాశాలకు చెందిన ఫిజియోథెరపీ గ్రూపు విద్యార్థి టి.శ్రీనివాసులు 952 మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఇద్దరికీ మంత్రి నారా లోకేశ్ షైనింగ్ స్టార్ 2025 అవార్డు ప్రదానం చేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం


సాయం అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణమనాయనపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు వెంకటరెడ్డి మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డిలు స్థానిక నేతలతో కలిసి వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు నందారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

శాంతిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టుపురుగుల పెంపకంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం సాయంత్రం కోతిగుట్లపల్లె గ్రామం వద్ద టీడీపీ నేత వెంకటాద్రినాయుడు నూతనంగా ఏర్పాటు చేసిన పట్టుపురుగుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో పట్టుపరిశ్రమను అభివృద్ధి పరచాలని కుప్పం నియోజకవర్గంలో అనేక చోట్ల ప్రభుత్వ శాఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులు బయట ప్రాంతాలకు వెళ్లి పట్టుపురుగులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు లేకుండా వెంకటాద్రినాయుడు పట్టుపురుగుల శాఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, నక్కనపల్లె శంకర్‌రెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, ఆర్ఎస్ మణి, మునిరత్నం, రమేష్‌రెడ్డి, గోపాల్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కుప్పం సమగ్రాభివృద్ధికి చంద్రబాబు వరాలు

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు వరాలు కురిపిస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం రామకుప్పం ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు సులోచన, వెంకట్రామగౌడులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రంలో ఏ అభివృద్ధి, సంక్షేమ పథకం అమలు చేసినా కుప్పం నియోజకవర్గానికి రెట్టింపు లబ్ధి చేకూర్చుతున్నారన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేలా, వారికి అన్ని విధాలా అండగా నిలిచేలా కార్యాచరణ ప్రణాళిక రచించి అమలు చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు సమష్టిగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు వివక్షకు తావులేకుండా అందరికీ అందేలా కృషి చేయాలన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కుప్పం అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతో వైసీపీ ఎంపీటీసీలు టీడీపీలో చేరారన్నారు. నీతి, నిజాయితీలో అంకితభావం ఉన్న వారు కుప్పం అభివృద్ధిలో తమ వెంట నడవాలనుకుంటే తాము సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. వైసీపీ పాలనలో అరాచకాలు, అవినీతికి పాల్పడిన ప్రతిఒక్కరూ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్ తరాలు బాగు పడతాయన్న నమ్మకంతో కూటమికి భారీ మెజారిటీతో ప్రజలు అధికారం అప్పజెప్పారన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు కాలేష్, ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి , కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, సీఎం పీఏ మనోహర్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలంతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయండి

- కడా పీడీ వికాస్ మర్మత్


శీగలపల్లెలో పర్యటించిన కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో 25 వార్డుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, అంచనాలు తయారు చేసి నివేదికలు సమర్పించాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. పురపాలక సంఘం 2వ వార్డు పరిధిలోని శీగలపల్లె, నారాయణపురం, హనుమంత కొట్టాలు, అనుప కొండ, మంగాపురం, కొక్కనూరు, పెద్దన్న కొట్టాలు ప్రాంతాలలో ఆయన బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా ప్రాంతాలలోని సమస్యలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి కష్టనష్టాల గురించి ఆరాతీశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారవుతోందని చెప్పారు. త్వరలోనే అన్నిరకాలుగా సమగ్రాభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

బహు భాషలు నేర్చుకోవడం సులభతరం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న శ్రీకాంత్

శాంతిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మాతృభాష ప్రావీణ్యంతోనే బహు భాషలు నేర్చుకోవడం సులభతరమవుతుందని ప్రభు త్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం శెట్టిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బహు భాషా ప్రావీణ్యంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ శెట్టిపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మళయాళం, కన్నడ, తమిళ భాషల్లో చదవడం, రాయడం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు ఇన్ని భాషలు రాయడం చదవడం నేర్పించిన ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యను అభినందించారు. పలు భాషల్లో మంచి ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతకాలను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, ఏఎంసీ నాగరాజు, చంద్రశేఖర్, రమేష్, ఆర్ఎస్ మణి, మునిరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయకొండలో వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చల్లా

చౌడేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. విజయవాడకు చెందిన దాత సౌమినిరెడ్డి రూ. 7 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్, వాటర్ కూలర్‌ను విరాళంగా ఇచ్చారు. బోయకొండలోని రాజగోపురం వద్ద దాత ఇచ్చిన ప్లాంట్‌ను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. కాలినడకన వచ్చే భక్తులకు మార్గం మధ్యలో ఏర్పాటు చేయడంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. దాత సౌమినిరెడ్డి మాట్లాడుతూ ఆలయ సిబ్బంది సురేంద్రరెడ్డి భక్తుల కోసం వాటర్‌ప్లాంట్ కావాలని అడగటంతో తాము విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు, ప్రదీప్‌రాజు, ఆలయ ఈవో ఏకాంబరం, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ

చౌడేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయకొండలో టీడీపీ నాయకుల మధ్య బుధవారం వివాదం చోటు చేసుకుంది. ఓ వర్గంపై మరో వర్గం దాడి చేసింది. వివరాలిలా.. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి బుధవారం బోయకొండలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. ఓ వర్గం ఆయన్ను బోయకొండ బస్టాప్ వద్ద టపాసులు పేల్చి స్వాగతం పలకగా... గాలి గోపురం వద్ద మరో వర్గం మళ్లీ టపాసులు పేల్చి స్వాగతం పలికింది. చల్లా రామచంద్రారెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి కిందికి వచ్చాక గాలి గోపురం వద్ద స్వాగతం పలికిన వర్గం బస్టాప్ వద్ద స్వాగతం పలికిన వర్గంపైకి ఘర్షణకు దిగింది. చల్లా వారిని సముదాయించి పంపించారు. అనంతరం తొలుత స్వాగతం పలికిన వర్గం వాళ్లు ఇంటికి వెళ్తుండగా.. రెండోసారి స్వాగతం పలికిన వర్గం సుమారు 15 మంది వెళ్లి దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న చల్లా రామచంద్రారెడ్డి పక్షిరాజపురంలోని బాధితుడి ఇంటికి వచ్చి పరామర్శించారు.

అగ్నిప్రమాదాల నివారణే ప్రధానం

కుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరిగిన తర్వాత మంటలను అదుపు చేయడంకంటే ఆ ప్రమాదాలు సంభవించకుండా నివారించడమే ప్రధానమని కుప్పం అగ్నిమాపక కేంద్రం అధికారి డి.ప్రవీణ్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో మూడో రోజు బుధవారం కుప్పం పురపాలక సంఘం బెగ్గిలపల్లె ఎన్టీఆర్ కాలనీలో స్థానికులకు ఆయన ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించి వాటి నివారణ, మంటలను అదుపు చేయడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఆర్.మోహన్, జి.నరేశ్, కె.కృష్ణయ్య, వి.విజయ, సి.రఘుపతి, కె.మణి, సీకే రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. ● పలమనేరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యుత్, గ్యాస్ కారణంగా కలిగే అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక కేంద్ర అధికారి మనోగరన్, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. పలమనేరులోని ప్రకృతి అపార్టుమెంట్, టెంపో, లారీ స్టాండ్‌ల వద్ద అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

● పుంగనూరు: గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాప్తి చెందిన సమయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపకాధిరి సుబ్బరాజు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక కట్టకిందపాళ్యంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో అగ్నిమాపక కార్యాలయ ఫోన్ నంబర్లు 08581- 253101, 850044510లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో నడివీధి గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 16: చౌడేపల్లె నడివీధి గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి అమ్మవారిని నడివీధిలో ప్రతిష్ఠించారు. వేకువజాము నుంచి గ్రామ పొలిమేరల్లో ఉన్న మారెమ్మ, చౌడేశ్వరమ్మ, నల్లగంగమ్మ, కుంటి గంగమ్మ, నడివీధి గంగమ్మలకు మహిళలు మంగళ వాయిద్యాల నడుమ దివ్వెలు, దీపాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా శ్రీనివాసులు నాయుడు

సోమల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సోమల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కరణం శ్రీనివాసులు నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇరికిపెంట సర్పంచిగా, ఎంపీటీసీ సభ్యుడిగా, చెన్నపట్నం చెరువు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా టీడీపీ ప్రభుత్వ హయాంలో పదవుల్లో పనిచేశారు. టీడీపీ పార్టీకి విధేయుడుగా ఉన్నారు. తన పదవికి సహకరించిన సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు నియోజక వర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు

పలమనేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు అన్నారు. బుధవారం కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్, కుప్పంలోని వన్‌ఎంబీ గ్రీన్ స్కిల్ సెంటర్ సౌజన్యంతో ప్లేస్‌మెంట్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి పొందేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ నందీశ్వరయ్య, జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.సురేష్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుబ్బయ్యనాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్.ఆర్.వెంకటేష్‌బాబు, రిసోర్స్ పర్సన్లు రమ్య, శశికళ పాల్గొన్నారు.

కందుకూరికి ఘన నివాళులు


మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

గంగవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా స్థానిక కళామందిరంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ విద్య, వితంతు వివాహాలను ప్రోత్సహించిన మహనీయుడు అని కొనియాడారు. రాజశేఖర చరిత్ర, ఆంధ్ర కవుల చరిత్ర , సత్యదేశ పూర్వ యాత్రలు లాంటి రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, ఆనంద బాబు, సీతారామయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలి


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు, సంఘ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మహేంద్ర తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ తయారు చేసిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మహేంద్ర మాట్లాడుతూ నైతిక విలువలు, సమాజంపై బాధ్యత పెంచే బోధన ప్రభుత్వ బడుల్లో సాధ్యమవుతుందన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, యూటీఎఫ్ నాయకులు నానికా నాయక్, మహమ్మద్ రఫీ, జయప్రకాష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గురజాల ప్రజాదర్బార్‌కు 72 వినతులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజాదర్బార్‌కు 72 వినతులు అందాయి. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నగర మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కొన్ని పరిష్కరించదగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూ సమస్యలు, ఫించన్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. తహశీల్దార్ లోకేశ్వరి, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం బంగారుపాళ్యం టీడీపీ కార్యాలయం ప్రజాదర్బార్ నిర్వహించారు. పూతలపట్టు నియోజకవర్గ ప్రజల నుంచి 57 వినతులు అందాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుకు ఖచ్చితమైన పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అప్పటికప్పుడే పరిష్కరించదగిన కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

10 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

పాలసముద్రం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సీఎం చంద్రబాబు సూచన మేరకు ప్రతి బుధవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. బుధవారం పాలసముద్రం వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువగా రెవెన్యూ, విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్జీలను 10 నుంచి 15 రోజుల్లో పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, వాసునాయుడు, తాళ్లూరు శివానాయుడు, బాలాజీ, రాజేంద్రన్, ఏపీడీ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా... తప్పిన ప్రమాదం

గుడిపాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో బుధవారం రాత్రి లారీ బోల్తాపడి పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు చెన్నై నుంచి వస్కోటకు వెళ్తున్న లారీ మార్గమధ్యమైన గాజులపల్లి ఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయానికి ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తమిళనాడు రాష్ట్రం వేలూరుకి చెందిన లారీ డ్రైవర్ శేఖర్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

104 వాహనం ద్వారా వైద్య సేవలు

యాదమరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు 104 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. పీహెచ్‌సీ పరిధిలోని వేపనపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు 104 సంచార వైద్య బృందం నెలకోసారి గ్రామాల్లో వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్తలు రమీలా, రమాదేవి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలచేతిలో ప్రభుత్వ సౌకర్యమే వాట్సాప్ గవర్నెన్స్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలచేతిలో ప్రభుత్వం అందించే సౌకర్యాలను సేవలను పొందడానికే వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టిందని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో మీటింగ్ హాలులో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ తమ మొబైల్‌ఫోన్లల్లో వనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) నెంబర్ 95523 00009తో తప్పనిసరిగా సేవ్ చేసుకోవాలని అన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

విజయపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లత్తూరు పంచాయతీలో బుధవారం పారిశుధ్య పనులు జోరుగా నిర్వహించారు. ఎక్స్‌కవేటర్‌తో చెత్తా చెదారాన్ని, పేడ దిబ్బలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, టీడీపీ నాయకులు రమేష్‌రాజు, మునిభాస్కర్‌రాజు, ఏలుమలై, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుశస్థలీనదిలో రసాయనాల కలుషితం


నదిలో తేలిన రసాయనాలు

నగరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కుశస్థలీనదిలో ఇసుక పూర్తిగా తోడేయడంతో రసాయన కలుషితాలు బయటపడ్డాయంటూ తెరణి వాసులు బుధవారం తహశీల్దార్ ధనంజయులు, ఆర్డీవో కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందించారు. ఇసుక ఉచితమనే సరికి ఇష్టానుసారంగా తరలించేస్తున్నారని ఫిర్యాదు చేశారు. డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయన నీటిని నదిలో వదిలేస్తుండటంతో అడుగుభాగంలో పేరుకుపోయిన రసాయన పదార్థాలు, ఉప్పు బయటపడుతుందని, నదిలో రంగునీరు వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బుగ్గ గుడి శివాలయ ప్రతిష్టను కాపాడండి



రఘునాథాచారి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుగ్గ గుడి శివాలయ ప్రతిష్టను కాపాడాలని సదరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రఘునాథాచారి కోరారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బుగ్గ గుడి అర్చకుడు, ఆఫీస్ సబార్డినేట్ వ్యవహారశైలివల్ల ఆలయ ప్రతిష్ట దిగజారుతోందని అన్నారు. స్వామివారికి అభిషేకం చేస్తానని తన వద్ద రూ.2500 తీసుకుని చేయలేదని ఆరోపించారు. భక్తుల వద్ద అనధికారంగా నగదు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈవిషయంపై టీటీడీ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా టీటీడీ చైర్మన్ స్పదించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన మధు, కల్పనల కుమార్తె ప్రీతి (19) తన అవ్వగారి ఊరైన బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి రెండు రోజుల క్రితం వచ్చింది. ప్రీతి మంగళవారం రాత్రి నుండి కనబడుటలేదని తల్లి కల్పన బుధవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

టూటౌన్ ఇన్‌చార్జి సీఐగా మహేశ్వర్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు టూటౌన్ ఇన్‌చార్జి సీఐగా మహేశ్వర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ సీఐగా వున్న నెట్టికంఠయ్య వ్యక్తిగత పనులపై నాలుగు రోజులు సెలవుపెట్టి వెళ్లారు. ఆయన స్థానంలో వన్‌టౌన్ సీఐ మహేశ్వర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

సంపద కేంద్రాలపై దృష్టి సారించండి

పెనుమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారుచేసే కేంద్రాలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని రామక్రిష్ణాపురం సచివాలయంలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీచేసి చెత్త సేకరణపై ఆరా తీశారు. అట్టవారిపల్లి ఏఏడబ్ల్యూలో లేఅవుట్‌ను పరిశీలించారు. సెక్రటరీ సునీత, సర్పంచ్ వెంకటేశ్, మురగయ్య పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు


ఇళ్లత్తూరులో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

విజయపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు రెచ్చిపోతున్నారు. రెండు నెలల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడంతో రైతులు ఏమి చేయాలో తెలియక తికమక పడుతున్నారు. మండలంలోని ఇళ్లత్తూరులో ఎంపీటీసీ సరళ వెంకటేశులు పొలం వద్ద రెండ్రోజుల క్రితం ట్రాన్స్‌పార్మర్ చోరీ చేసి కాపర్ వైర్ తీసుకొని బాక్సును వదిలివెళ్లారు. గత నెలలో జంబాడలో డి.నారాయణరాజు పొలం వద్ద, పాతార్కాడులో వెంకటేశులు రాజు పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేశారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో సాగు నీరు అందించలేక ఇబ్బంది పడుతుంటే దొంగలు ఇలా రెచ్చిపోతున్నారని వాపోతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ సదాశివం కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు



కార్వేటినగరం పెద్దహరిజనవాడలో తాగునీటిని పరీక్షిస్తున్న కేంద్ర కమిటీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వాల లక్ష్యమని కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన నేషనల్ వాష్ నిపుణులు పి.అంబజ్గాన్ తెలిపారు. బుధవారం కార్వేటినగరం పెద్దహరిజనవాడలో జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి కొళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్వేటినగరం పెద్దహరిజనవాడలో ఫీల్డ్ టెస్ట్ కిట్ ద్వారా నీటి నాణ్యతను తనిఖీ చేశారు. స్థానిక అధికారులు, వీడబ్ల్యుఎస్‌సీ కమిటీ సభ్యులు పనుల నాణ్యతను, పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పీవీ నరేంద్రకుమార్, డీఈఈ ఎంఆర్ సతీష్‌కుమార్, ఏఈఈ కె.గిరీష్‌కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో పెద్దిరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వినాయకపురంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదవశాత్తు గ్యాస్ స్టౌవ్ నుంచి మంటలు చెలరేగితే ఎలా మంటలార్పాలి, ఇతర అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా నివారించాలి, స్వీయ రక్షణ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌వో కరుణాకర్, ఎల్ఎఫ్‌లు సురేష్, ఏసుపాదం, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో...

నగరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన అవసరమని నగరి ఫైర్‌స్టేషన్ ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని నగరిపేటలో బుధవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆ శాఖ సిబ్బంది స్థానికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సిలిండర్ నుంచి గ్యాస్ లీకైతే వచ్చే మంటలను ఎలా అదుపు చేయాలన్న అంశంపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు.

పిల్లల విద్యాభ్యాసంతోనే భవిష్యత్తుకు బంగారుబాట

● జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భారతి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మీ పిల్లల విద్యాభ్యాసంతోనే ఎస్టీ కుటుంబాల భవిష్యత్తుకు బంగారుబాట పడుతుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి అన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కలిజవేడు పంచాయతీ కె.నాశంపల్లె ఎస్టీకాలనీ సర్పంచ్ నీలావతి అధ్యక్షతన బుధవారం గిరిజన హక్కులు - చట్టాల గురించి అవగాహన సమావేశం జరిగింది. జడ్జి మాట్లాడుతూ ఎస్టీలకు చట్టపరమైన సమస్యలతో పాటు ఇబ్బందులు ఏర్పడినపుడు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. ఎస్టీలకు అన్యాయం జరిగితే న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయిస్తే, వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి, ఎంఈవో ఆంజనేయులుశెట్టి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సురేంద్రరెడ్డి, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంగీత, ఆర్‌ఐఏకాంబరం, పంచాయతీ కార్యదర్శి లావణ్య, వీఆర్వో ఫాతిమా, ఎస్టీ కుటుంబాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

నింద్ర, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకార్యార్థం శ్రీరామపురంలో చెన్నై శంకర్ నేత్రాలయ సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానికులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 18 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయన్నట్లు వైద్యులు తెలిపారు. రాస్ ప్రాజెక్ట్ అధికారి రవి, శంకర్ నేత్రాలయ వైద్యులు వేణు, వెంకటముని, రాస్ సంఘం సభ్యులు సీతాలు, హేమావతి, ఉషారాణి, తేజ, కనకవల్లి పాల్గొన్నారు.

వైభవంగా మారియమ్మ మహా కుంభాభిషేక ఉత్సవాలు


మహా కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

గుడిపాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లమడుగు పంచాయతీ చింతగుంటూరులో బుధవారం మారియమ్మ మహా కుంభాభిషేక ఉత్సవాన్ని ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, మాంగల్యధారణ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని బాణసంచా పేలుళ్ల, మంగళవాయిద్యాల నడుమ పుష్పపల్లకిలో ఊరేగించారు.

రోజా నియామకంపై హర్షం

నగరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పీఏసీ సభ్యురాలిగా మాజీమంత్రి ఆర్‌కే రోజా నియామకంపై నగరి వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నాయకులు ఆమెను సన్మానించారు. కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడంలో జగన్మోహన్‌రెడ్డి ప్రథములని వారు కొనియాడారు. అనంతరం రోజా మాట్లాడుతూ అధికారంలో లేకున్నా కార్యకర్తలు, నాయకుల కష్ట సుఖాలలో పాలుపంచుకోవడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.

పీవీకేఎన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అడ్మిషన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసినట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. వివిధ కోర్సులతో పాటు కరికులమ్, ఉద్యోగావకాశాలు, హాస్టల్ వసతి కలిగిన ఏ గ్రేడ్ కళాశాలలో అడ్మిషన్లు పొందడానికి విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 94943 68020, 99630 63258 (బీఏ), 99851 65051, 79894 35754(బీఎస్సీ), 98499 59423, 87900 42449 (బి.కాం) నంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్


శిలాఫలాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ థామస్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం ఎస్‌ఆర్‌పురం మండలం జంగాలపల్లి నుంచి 52 కన్నికపురం వరకు సుమారు రూ.75లక్షలతో బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. థామస్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జంగాలపల్లి గ్రామస్థుల కల నెరవేరిందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అధికారంలో ఉన్నప్పుడు పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్, బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, ఎస్.కుమార్, రాజశేఖర్ నాయుడు, జలంధర్ నాయుడు, విశ్వనాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడండి


వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిమానుపెంట పంచాయతీ దళితవాడలో జలజీవన్ మిషన్, జడ్పీ నిధులతో నూతనంగా రూ.27.76 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వేసవిలో మండలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉండరాదని అధికారులకు సూచించారు. రాగిమానుపెంట దళితవాడలో ఇళ్లపై కరెంట్ తీగలు ఉన్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన ఏఈ దేవీప్రసన్నకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జీలు ధరణీప్రసాద్ నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, బాలక్రిష్ణమ నాయుడు, సర్పంచ్ తోటా శ్రీహరి, సుబ్రమణ్యం నాయుడు, నాగరాజ నాయుడు, జనార్ధన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విభేదాలను పక్కనపెట్టి పార్టీ కోసం పని చేయండి

పాలసముద్రం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పార్టీలో చిన్నచిన్న విభేదాలను, మనస్పర్థలను పక్కనబెట్టి పార్టీ పటిష్ఠత కోసం అందరూ పని చేయాలని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కార్యకర్తే అధినేత అనే కార్యక్రమాన్ని టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బలిజకండ్రిగ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందలేదని గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేసి తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, తాళ్ళూరు శివానాయుడు, బాలాజీ, రాజేంద్రన్, కృష్ణమ నాయుడు, రుద్రయ్యనాయుడు, అరుణ, అరుళ్‌నాథన్, తంగరాజ్ పాల్గొన్నారు.

అగస్తీశ్వర స్వామి ఆదాయం రూ.లక్ష

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర ఆలయంలో బుధవారం స్వామి వారి హుండీ లెక్కింపును అధికారులు భక్తుల సమక్షంలో నిర్వహించారు. లెక్కింపులో స్వామివారికి భక్తులు రూ.1,09,627లు హుండీ ద్వారా సమర్పించారు. ఈ నగదును స్థానిక ప్రభుత్వ రంగ బ్యాంకులో ఈవో వెంకటరాయలు డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శివకుమార్, శివాచార్యులు, కాలభైరవట్రస్టు వ్యవస్థాపకులు టి.వెంకటేషన్, ఉదయ్ జ్యూవెలరీస్ అధినేత మల్లీ ఆచారి, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, సిబ్బంది చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు... బుధవారం బంగారుపాళ్యం నుంచి స్కూల్ విద్యార్థులను తీసుకెళుతున్న ఆటో చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో కొత్తపల్లె సమీపంలోని చరణ్ డాబా వద్ద సర్వీస్ రోడ్డులో వెళుతూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మండల కేంద్రంలోని భవిత స్కూల్‌లో మూడవ తరగతి చదువుతున్న పాలమాకులపల్లెకు చెందిన ప్రకాష్ కుమారుడు యువతేజ్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. పాలేరు గ్రామానికి చెందిన జీవన్ బాబు కుమార్తె సౌమశ్రీ చైతన్య స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఈ ప్రమాదంలో సౌమ్యశ్రీ చెవి, కాలుకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ షణ్ముగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిరుధాన్యాలతో పౌష్టికాహార లోపం నివారణ

తవణంపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిరు ధాన్యాల వాడకంతో పౌష్టికాహార లోపాన్ని నివారించవచ్చునని చిత్తూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం తొడతర గ్రామంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏవో ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా భాస్కర్ నాయుడు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కర్రిఆవుల భాస్కర్ నాయుడిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తవణంపల్లె మండలం కొండ్రాజుకాల్వ పంచాయతీ వడ్డపల్లె గ్రామానికి చెందిన భాస్కర్ నాయుడు గత టీడీపీ ప్రభుత్వంలో తవణంపల్లె మండల వైస్ ఎంపీపీగా పనిచేశారు. భాస్కర్ నాయుడు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి, రైతులకు అండగా ఉంటానని చెప్పారు. తనపై నమ్మకంతో పార్టీ ఈ పదవిని కట్టబెట్టిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి లోకేష్‌కు, ఎమ్మెల్యే మురళీమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.